
చేనేత పార్కు నుంచి మట్టిని తరలించడంతో ఏర్పడిన గుంతలు



చేనేత పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

కలగానే చేనేత పార్కు

జోగుళాంబ గద్వాల జిల్లాలో శిలాఫలకాలకే పరిమితం

- 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన
- 2018లో మాజీ మంత్రి కేటీఆర్ మరో సారి శిలాఫలకం ఆవిష్కరణ
- రూ.52 కోట్లతో డీపీఆర్ తయారైనా లభించని ఆమోదం
- ఎదురుచూపులతోనే కాలం గడుపుతున్న చేనేత కార్మికులు

గద్వాల, ఏప్రిల్ 28: జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్మించతలపెట్టిన చేనేత పార్కు శిలాఫలకాలకే పరిమితమైంది. గద్వాల చేనేత జరీ చీరలకు దేశ.. విదేశాల్లో మంచి గుర్తింపు ఉంది. ఇక్కడి కార్మికులు నైపుణ్యం, నాణ్యమైన ముడిసరుకుతో చీరలు తయారు చేయడం వల్ల ఆ పేరు వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది చేనేత కార్మికులు నేత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. వారి నైపుణ్యాన్ని వృద్ధి చేయడంతో పాటు.. ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే తలంపుతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గద్వాలలో చేనేత పార్కును నిర్మించేందుకు స్థల సేకరణ చేసింది. గద్వాల మండలం పూడూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 368/ఏలో 47.25 ఎకరాల భూమిని కేటాయించింది. ఇది గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారి అంచున ఉంటుంది. ఈ పార్కు నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థాపనలు జరిగినా.. నిర్మాణం మాత్రం అడుగు ముందు పడలేదు.

3,500 మగ్గాలు.. 11 వేల మంది కార్మికులు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 3,500 మగ్గాలు ఉండగా.. 11 వేల మందికిపైగా కార్మికులు వాటిపై ఆధారపడి జీవనం గడుపుతున్నారు. వీరంతా గద్వాల బ్రాండ్ తోనే జరీ చీరలు తయారు చేస్తున్నారు. రాజోలీ, అయిజ, గట్టు, గద్వాల, అలంపూర్, ఎక్లాస్‌పూర్, బూడిదపాడు, మాచర్ల, అమరచింత, కొత్తకోట, కోటకొండ తదితర ప్రాంతాలలో చేనేత మగ్గాలపై గద్వాల జరీ చీరలను తయారు చేస్తున్నారు. ఒక్క జోగుళాంబ గద్వాల జిల్లాలో 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. 14 చేనేత సంఘాలు ఉన్నాయి. వారిలో కాలానుగుణంగా నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ ఇవ్వడంతో పాటు హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌ల క్లస్టర్‌లను ఏర్పాటు చేయాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రిగా ఉన్న డీకే అరుణ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో 2008 అక్టోబరు ఐదున చేనేత పార్కు కోసం శంకుస్థాపన చేయించారు. వెంటనే హద్దులు నిర్ణయించి, కంచె ఏర్పాటు కోసం రూ.50 లక్షల నిధులను విడుదల చేయించారు. ఆ తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణం, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల ప్రభుత్వం ఏర్పడటం.. తెలంగాణ ఉద్యమం తీవ్రతరం కావడంతో పాలకులు దీనిని పట్టించుకోలేదు. 2018, జనవరి 31న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. చేనేత, జౌళిశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను గద్వాలకు పిలిపించి చేనేత పార్కుకు రెండోసారి శంకుస్థాపన చేయించారు.

రూ.52 కోట్లతో ప్రతిపాదనలు తయారు

కేటీఆర్ శంకుస్థాపన చేయడంతో అధికారులు పార్కులో పది ఎకరాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లకు కామన్ వర్క్ షెడ్, పరిపాలన భవనం, ప్రహరీ తదితర వాటిని నిర్మించేందుకు 2022లో రూ.52 కోట్లతో అంచనాలను తయారు చేశారు. అందులో మొదటి విడతగా రూ.21 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి డీపీఆర్‌ను తయారు చేసి పంపించారు. మాస్టర్ వీవర్స్ భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో ప్రాజెక్టు విలువలో 30 శాతం వారు భరించాలని, మిగిలింది ప్రభుత్వం భరిస్తుందని ఒక ప్రతిపాదన.. లేదంటే ప్రభుత్వమే మొత్తం భరించి, బహిరంగ వేలం ద్వారా మాస్టర్ వీవర్స్‌కు అప్పగిస్తుందని ఇంకో ప్రతిపాదనతో డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించింది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ప్రతిపాదించిన డీపీఆర్‌ను ఈ ప్రభుత్వం ఆమోదిస్తుందా? మళ్లీ కొత్త డీపీఆర్‌ను తయారు చేయమంటుందా? తెలియని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. కార్మికులు మాత్రం చేనేత పార్కు కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

> చేనేత పార్కు నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో తయారు చేసిన డీపీఆర్ గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. ఈ ప్రభుత్వం ఒక వేళ

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



చేనేత కార్మికులకు హ్యాండ్లూమ్‌లతో పాటు ఇతర సదుపాయాలతో కొత్త డీపీఆర్‌ను తయారు చేయాలని చెబితే దాని ప్రకారం నడుచుకుంటాం. ప్రస్తుతం అయితే ఎన్నికల కోడ్ ఉన్నందున ఆ తర్వాతనే మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.
- గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ ఏడీ, గద్వాల

మట్టి మాఫియా చేతుల్లో పార్కు స్థలం

చాలా ఏళ్ల నుంచి చేనేత పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో అక్రమార్కుల కన్నుదానిపై పడింది. మట్టి మాఫియా చాలా సార్లు ఈ స్థలం నుంచి మట్టిని తరలించడంతో అక్కడ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీనిపై చాలాసార్లు చేనేత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. రాత్రి సమయాల్లో మట్టిని, రాళ్లను తరలిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అక్కడ మట్టిని తరలిస్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన వాహనాలను పట్టుకొని, ఫైన్ కూడా వేశారు. కంచె లేకపోవడం, స్థలం వృథాగా ఉండటంతోనే అక్రమార్కుల దృష్టి దానిపై పడుతున్నదని కార్మికులు వాపోతున్నారు.

గురుకుల కళాశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- మహబూబ్‌నగర్‌లో 12 కేంద్రాల ఏర్పాటు
- సెంటర్లను పరిశీలించిన డీఈవో రవీందర్, ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి
- 89.9 హాజరు శాతం నమోదు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రవీందర్, ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 28: మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 12 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్న నిబంధన ఉండటంతో విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. వారి వెంట తల్లిదండ్రులు, బంధువులు రావడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 1,908 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,696 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరు అయ్యారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు 847 మంది హాజరు కావాల్సి ఉండగా.. 755 మంది హాజరయ్యారు. 92 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం 2,755 మందికి గాను 2,451 మంది హాజరు కాగా.. 304 మంది గైర్హాజరు అయ్యారు. 89.9 హాజరు శాతం నమోదైంది. డీఈవో ఎ.రవీందర్, ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో వెంకటొరెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల, ఎన్‌టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు.

దేశాన్ని ముక్కలు చేస్తున్న మోదీ

- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యం: చల్లా వంశీచంద్‌రెడ్డి


సేవాలాల్ ఆలయంలో పూజలు చేస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్/బాలానగర్, ఏప్రిల్ 28: కుల మతాల పేరుతో దేశాన్ని ముక్కలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించాలని కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, ఈ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన బాలానగర్ మండలంలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మోతీమణపురం, మేడిగడ్డ తండా, కుర్వగడ్డ తండా, పూరారం, ఈదమ్మగడ్డ తండా, రాజాపూర్‌లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని సేవాలాల్, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు వారికి హారతులు పట్టి స్వాగతించారు. ఆయా చోట్ల వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుందన్నారు. దాంతో ప్రజల దృష్టిని మరల్చేందుకు రాముడిని, మతాన్ని వాడుకుంటూ ఓటు బ్యాంక్ కోసం మత విభజన సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన మోదీ ప్రభుత్వానికి ఎంతమాత్రం కొనసాగే అర్హత లేదన్నారు. దేశంలో మోదీ.. రాష్ట్రంలో కేసీఆర్ గజదొంగల్లా మారారని, మోదీ దేశాన్ని అమ్మితే, కేసీఆర్ రాష్ట్ర సంపదను దోచి కుటుంబ సభ్యులకు పంచి పెట్టారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను కేసీఆర్ విమర్శించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, బాలానగర్, రాజాపూర్ మండలాల అధ్యక్షులు శంకర్‌నాయక్, కృష్ణయ్య యాదవ్, నాయకులు సందీశ్వర్, ప్రదీప్, కిషన్‌నాయక్, నరేందర్‌రెడ్డి, సోమ్లానాయక్, మంజుల, రాజేశ్వర్‌రెడ్డి, మల్లేశ్, చంద్రకాంత్, శ్రీశైలం, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ ఆదివాసి విభాగం అధ్యక్షుడు లింగంనాయక్ అధ్యక్షతన పార్లమెంటరీ భంజారా, ఆదివాసి కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ ప్రధాని అయితేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు.

ఉగ్ర భానుడు



- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 41 డిగ్రీలకు పైగా నమోదు
- అల్లాడిపోతున్న ఉమ్మడి జిల్లా ప్రజలు


తాటికొండ శివారులోని బావిలో ఈత కొడుతున్న యువకులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 28 : మండుతున్న ఎండలతో ఉమ్మడి పాలమూరు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8.30 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇంటి నుంచి అడుగు బయట పెట్టే పరిస్థితి ఉండటం లేదు. దీంతో ఎక్కువ మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇళ్లలోనూ ఉక్కపోత ఎక్కువవడంతో ఫ్యాన్‌లు, కూలర్లు ఉన్నా పెద్దగా ఫలితం లేని పరిస్థితి నెలకొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంటలో 44.1, బాలనగర్‌లో 44 డిగ్రీలుగా నమోదు కాగా, అడ్డాకులలో 43.4, కోయిలకొండలో 43.3, మిడ్జిల్‌లో 43.1, మహబుబూబ్‌నగర్‌లో 43 డిగ్రీలు నమోదైంది. జడ్చర్లలో 42.2, భూత్పూర్‌లో 42.8 డిగ్రీలుండగా, జిల్లాలో అత్యల్పంగా నవాబ్‌పేటలో 40.1 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ఈతతో సేదతీరుతున్న యువకులు


భూత్పూరు: ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో యువకులు, పిల్లలు బావుల్లో ఈత కొడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ శివారులో గల ఓ బావిలో పాలమూరు పట్టణం నుంచి వచ్చిన యువకులు ఈత కొట్టారు. 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈత కొడుతూ సేదతీరుతున్నారు. వాహనాల్లో వచ్చి ఈత కొడుతున్నారు.

● నారాయణపేట జిల్లావ్యాప్తంగా ఆదివారం ఎండ మరింత తీవ్రమైంది. గరిష్ఠ ఉష్ణోగ్రత 43 డిగ్రీలుండగా, కనిష్ఠం 29 డిగ్రీలుగా నమోదయ్యింది. కోస్గి మండలంలో 41, మక్తల్‌లో 42, నర్వలో 42, కృష్ణలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. జిల్లాలో మరో ఐదు రోజుల పాటు తీవ్రమైన వడగాలులతో పాటు ఉష్ణోగ్రత గరిష్ఠంగా 45 డిగ్రీలకు చేరుకోనే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.

● వనపర్తి జిల్లా, కొత్తకోట మండల పరిధిలోని కానాయపల్లిలో అత్యధికంగా 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పానుగల్ 43.7 , శ్రీరంగాపూర్ 43.4, మదనాపూర్ 43.0, చిన్నంబావి 42.8, పెబ్బేరు 42.6, ఆత్మకూరు, అమరచింత 42.5 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. పెద్దమందడి 42.4, గోపాల్‌పేట, వనపర్తి 41.9, రేవల్లి, ఘణపూర్, వీపనగండ్ల మండలంలో 41.2 డిగ్రీలుగా ఉంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 25.1లుగా నమోదయ్యింది.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం అత్యధికంగా కోడేరు మండలంలో 43.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. బిజినేపల్లిలో 43.3, అచ్చంపేటలో 42.5, కొల్లాపూర్‌లో 41.9, కల్వకుర్తిలో 41.8, పెంట్లవెల్లిలో 41.7, పెద్దకొత్తపల్లిలో 41.5, చారకొండలో 41.1, ఉప్పునుంతలలో 40.9, పదరలో 40.3, నాగర్‌కర్నూల్‌లో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అత్యధికంగా ధరూరులో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత కాగా, అత్యల్పంగా గట్టులో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటిక్యాలలో 44 డిగ్రీలు, అలంపూర్‌లో 43.9 డిగ్రీలు, గద్వాలలో 43.2డిగ్రీలు, ఉండవల్లిలో 43.1 డిగ్రీలు, కేటిదొడ్డి, వడ్డేపల్లి మండలాల్లో 43 డిగ్రీలు, అయిజ, మల్దకల్ మండలాల్లో 42.3 డిగ్రీలు, రాజోలి 41.8 డిగ్రీలు, మానవపాడులో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లిలో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన రోడ్డు


పట్టుబడ్డ మొసలి

భారీ మొసలి పట్టివేత

కొత్తకోట, ఏప్రిల్ 28: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం భూత్పూర్ గ్రామంలో ఆదివారం భారీ మొసలిని బంధించారు. గ్రామానికి చెందిన నాగరాజు వరి పొలానికి శేఖర్ నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. మొసలిని గమనించి, భయపడి, తోటి రైతులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న యువకులు జిల్లా కేంద్రంలోని స్నేక్ సొసైటీ నిర్వాహకుడు, హోంగార్డు కృష్ణ సాగర్‌కు సమాచారం ఇచ్చారు. కృష్ణ సాగర్ గ్రామానికి వచ్చి, యువకుల సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి మొసలిని తాళ్లతో బంధించారు. అది 185 కిలోల బరువు ఉంది. ఎస్పీ రక్షిత కె మూర్తి ఆదేశాల మేరకు మొసలిని జూరాల ప్రాజెక్టులో వదిలేయడానికి తీసుకెళ్లారు. మొసలిని చాకచక్యంగా బంధించిన కృష్ణసాగర్‌ను గ్రామస్థులు అభినందించారు. జూరాల ప్రాజెక్టు, రామన్‌పాడు రిజర్వాయర్ కాల్వల పరివాహక ప్రాంత రైతులు, పశువులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెప్పారు. మొసలిని బంధించిన వారిలో ఆ గ్రామ యువకులు గోపాల్, నరసింహ, సాయి, అవినాష్, శివ ఉన్నారు.

సీఎంకు నిద్రపట్టడం లేదు: డీకే అరుణ

మిడ్జిల్/నవాబ్‌పేట, ఏప్రిల్ 28: పాలమూరులో బీజేపీ అభ్యర్థులకు వస్తున్న ఆదరణ చూసి సీఎం రేవంత్‌రెడ్డికి నిద్ర పట్టడం లేదని, సీఎం ఇంకా ఎన్ని సార్లు జిల్లాకు వచ్చినా.. ఉమ్మడి పాలమూరులో బీజేపీదే విజయమని ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అధ్యక్షతన యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టులేదని, పరిపాలనపై అవగాహన లేక పూటకో మాట మాట్లాడుతున్నారని చెప్పారు. కల్వకుర్తిలో బీజేపీ అభ్యర్థి ఆచారిపై 71 ఓట్లతో గెలిచిన వంశీచంద్‌రెడ్డి.. మళ్లీ ఎన్నికల్లో ఎన్ని ఓట్లు తెచ్చుకున్నారో, అక్కడి ప్రజలకు ఏమేర అందుబాటులో ఉన్నారో తెలుసన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సెక్రటేరియెట్‌కు రాని వారికి బీజేపీ తెలంగాణకు ఇచ్చిన నిధుల గురించి ఎలా తెలుస్తుందని కేసీఆర్‌ను ఉద్దేశించి పరోక్షంగా అన్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ జైలుకు వెళ్లడం, పాలమూరులో అరుణమ్మ గెలవడం ఖాయమన్నారు. డీకే అరుణ, తల్లోజు ఆచారి, రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురిని శాలువాలతో సన్మానించారు.


జడ్చర్లలో మాట్లాడుతున్న డీకే అరుణ

● నవాబ్‌పేట మండలంలోని కొల్లూర్, నవాబ్‌పేట, కారుకొండ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో డీకే అరుణ మాట్లాడారు. కొల్లూర్‌ను మండలం చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి

గట్టు, ఏప్రిల్ 28: క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని గట్టు జడ్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల అన్నారు. మండల పరిధిలోని బల్గెర గ్రామంలో దిగంబర స్వామి జాతర సందర్భంగా 11రోజులుగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్ పోటీలు ముగిశాయి. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో 11 రోజులుగా క్రీడాకారులు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొదటి విజేతగా నోబెల్ కింగ్స్ గెలుపొందడంతో రూ. 40 వేల నగదు, షీల్డ్‌ను జడ్పీటీసీ అందజేశారు. ద్వితీయ విజేతగా శివాజీ కింగ్స్ గెలుపొందడంతో ఎంపీటీసీ సభ్యురాలు రూపవతి కిష్టప్ప రూ. 20వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. తృతీయ విజేతగా పంచముఖి బ్రిక్స్ నిలువడంతో రూ. 10 వేల నగదును బాసు నాయుడు అందజేశారు. క్రికెట్ పోటీలు విజయవంతగా ముగిసినందుకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హన్మంతునాయుడు, నాయకులు కిష్టప్ప, రాజు, పొగాకు ఈరన్న, వీరారెడ్డి, ఈరన్న, డేవిడ్, బుగ్గల్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



భీమవరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

అలంపూరు ఏప్రిల్ 28: బాలికలను వేధిస్తే కఠిన శిక్షలు ఉన్నాయని ఎస్సై నాగరాజు అన్నారు. పోలీసింగ్ కమ్యూనిటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలను వేధిస్తే పోక్సో కేసు నమోదు అవుతుందని, ఏడు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. అలాగే పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పోలీస్‌సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంతంపల్లి గ్రామంలో..

గట్టు: మండల పరిధిలోని అంతంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఎస్సై రామకృష్ణ 41ఏ సీఆర్‌పీసీ నోటీస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది, కళాబృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు చాంపియన్‌షిప్



అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అందుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారులతో కోచ్‌లు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 28: సూర్యాపేట జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్ లభించింది. రాష్ట్ర స్థాయి స్ప్రింట్, మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పోటీల్లో జిల్లా నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 14 మంది అథ్లెట్లు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగులో ఎం.మనీషా స్వర్ణం, జి.కల్పన కాంస్యం పతకాలు సాధించగా 800 మీటర్ల పరుగులో ఎం.పూజ స్వర్ణం, 1500 మీటర్ల పరుగులో ఎం.టాబు రజతం, 3000 మీటర్ల పరుగులో ఎన్.అనూష రజతం, పి.ఉషారాణి కాంస్య పతకాలు పొందారు. అదే విధంగా అండర్-18 విభాగం 100 మీటర్ల పరుగులో ఎ.గణేష్ రజతం, 2000 మీటర్ల పరుగులో కె.స్వప్న స్వర్ణం, ఆర్.కీర్తన కాంస్య పతకాలు అందుగున్నారు. అండర్-16 విభాగం 100 మీటర్ల పరుగులో ఎ.నక్షత్ర స్వర్ణం, ఎం.భానుప్రసాద్ రజతం, 2000 మీటర్ల పరుగులో బి.మధుప్రియ రజతం, డి.సంతోష్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారు. అలాగే అండర్-14 విభాగం 600 మీటర్ల పరుగులో జె.గంగోత్రి కాంస్య పతకం అందుకుంది. జిల్లా క్రీడాకారులు మొత్తం 14 పతకాలు, 46 పాయింట్లతో ఓవరాల్ చాపియన్‌షిప్ సాధించడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి జేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.




పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన బసంత్

● **నారాయణపేట /మక్తల్ :** సూర్యపేట జిల్లాలో జరిగిన మూడవ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మిడిల్ లాంగ్ డిస్టెన్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మక్తల్ పట్టణానికి చెందిన బసంత్‌కు బంగారు పతకం వరించింది. అదే విధంగా మహిళా విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీలతకు కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకొచ్చిన క్రీడాకారులను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ, నందునామాజీ, వెంకటేష్, అంబ్రేష్, నర్సింహులు, జగదీష్, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి, టీకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ నాయకులు గవినోళ్ల బాలక్రిష్టా రెడ్డి అభినందించారు.

కెమెరా కంటికి చిక్కిన చిరుతలు

బిజినేపల్లి, ఏప్రిల్ 28 : కొంతకాలంగా గంగారం ఫారెస్టులోకి చిరుతల సంచారం కలకలం రేపుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం ఫారెస్టు సమీప తండాల్లోని పశువులపై చిరుతలు దాడి చేసిన ఘటనలతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని హడలిపోయారు. ఆదివారం గంగారం ఫారెస్టులో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కెమెరాలకు చిరుత పులులు సంచారం చేస్తున్న ఫొటోలు హల్‌చల్ చేస్తున్నాయి. గంగారం ఫారెస్టులోని నేరేడువంపు సమీపంలో ఉన్న సోలార్ పంపుసెట్ వద్దకు మంచినీరు తాగేందుకు వచ్చిన చిరుతలు కెమెరా కంటికి చిక్కాయి. అలాగే చిరుతలతో పాటు సాంబారుల ఫొటోలు కూడా కెమెరాలో బంధించారు. గంగారం ఫారెస్టులో పూర్తిస్థాయిలో కెమెరాల ద్వారా చిరుత పులుల సంఖ్యను గుర్తించి అందుకు అనుగుణంగా ఫారెస్టు అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని అటవీ సమీప తండావాసులు కోరుతున్నారు.



గంగారం ఫారెస్టులోని నేరేడు వంపు వద్ద మంచినీరు తాగేందుకు వచ్చిన చిరుత

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కొత్తపల్లి : చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం గొర్లోనిబావి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొర్లోనిబావి గ్రామానికి చెందిన కావలి అంజిలయ్యకు చెందిన వ్యవసాయ పొలం భూనీడు గ్రామ



గొర్లోనిబావి గ్రామంలో మృతి చెందిన దూడ

శివారులో ఉంది. రోజు మాదిరిగా శనివారం రాత్రి పశువులను కట్టివేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెంది ఉండడాన్ని గమనించి బోరున విలపించారు.

ఆవును చంపిన పెద్దపులి

పెద్దకొత్తపల్లి : ఆవును పెద్దపులి చంపి తిన్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని చంద్రబండతండా పెద్దవాగు సమీపంలో జరిగింది. ఆదివారం ఆవుల కాపరి తెలిపిన వివరాల ప్రకారం... మారేడమానుదిన్నె గ్రామానికి చెందిన సొప్పరి బాలయ్య తన ఆవుల మందను చంద్రబండతండా సమీపంలో ఉంచారు. రోజువారిగా ఆవుల మందను మేపుకురావడానికి లింగాల మండలం రాయవరం సమీపంలోకి వెళ్లారు. ఆవుల గుంపులో నుంచి ఒక ఆవు లేగదూడ కోసం తిరిగి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆవును వెతకగా చంద్రబండతండా పెద్దవాగు సమీపంలో పెద్దపులి చంపి తిన్నట్లు పులి కాలు జాడలు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు ఆవు విలువ 30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. తన ఆవును పెద్దపులి చంపడంతో ఆవుల కాపరి భయాందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవాబ్‌పేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని నవాబ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సమావేశమై నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2004-05 బ్యాచ్‌కు చెందిన పలువురు విద్యార్థులు నాటి గురువులు చెప్పిన మాటలను, వారు ఆడుకున్న ప్రదేశాలను గుర్తు చేసుకున్నారు. జీవితంలో విద్యార్థి దశ మరిచి పోలేనిదని అన్నారు. అనంతరం గురువులకు సన్మానించగా, జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని గురువులు వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాడెమోని రాజు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

● మిడ్జిల్ (జడ్చర్ల) : జడ్చర్ల పట్టణంలోని నాగార్జున పాఠశాల 2003-04 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమయ్యారు. అప్పటి విద్యార్థి, ప్రస్తుతం జడ్చర్ల మునిసిపాలిటీ కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీహరి, నరేందర్, జంగయ్యను సన్మానించారు. పాఠశాలలో విద్యనేర్పిన ఉపాధ్యాయుడు జంగయ్యకు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. పూర్వవిద్యార్థులు కరుణాకర్, సుభాష్, నరేష్, శివరాం, మధుసూదన్, రాఘవేందర్, మహేష్ ఉన్నారు.

పెండింగ్ డబ్బులు అందేనా?

- నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు అందని డబ్బులు
- సాఫ్ట్‌వేర్ సమస్య ఉత్పన్నం
- ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరిస్తామంటున్న అధికారులు

హన్వాడ, ఏప్రిల్ 28 : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు నాలుగు నెలల పెండింగ్ కూలి డబ్బులు అందడం లేదు. 2023 సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు ఆ నాలుగు నెలలకు సంబంధించిన కూలి డబ్బులు అందలేదు. కొందరికి బ్యాంకుల ద్వారా, మరికొందరికి పోస్టాఫీసు ద్వారా డబ్బులు చెల్లిస్తారు. పైన పేర్కొన్న నాలుగు నెలలకు ముందున్న సాఫ్ట్‌వేర్ వల్ల కూలీల వేలిముద్రలు తీసు కొని వారికి డబ్బులు చెల్లించే వారు. ఉన్నట్లుండి ప్రభుత్వం అప్పటి వరకు ఉన్న డీక్యూబ్ సాఫ్ట్‌వేర్‌ను మార్చి మరో సాఫ్ట్ వేర్‌ను అమలు చేయాలని ఆదేశించింది. దీంతో అప్పటి వరకు ఉన్న వేలిముద్రల సేకరణ తీసేసి, ఓచర్ రాయించుకొని కూలీలు



హన్వాడలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



హన్వాడ పోస్టాఫీస్

డబ్బులు ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. అలా పలు గ్రామాల్లోని కొందరు కూలీలు డబ్బులు తీసుకున్నారు. ఇదంతా కొత్తగా వచ్చిన సాఫ్టవేర్ సమస్య మూలంగా కొందరికి అందలేదని పోస్టాఫీస్ సిబ్బంది చెప్పుతున్నారు. ఆ నాలుగు నెలల తర్వాత నవంబరు నుంచి నేటి వరకు పని చేసిన కూలీలకు డబ్బులు యధావిధిగా వస్తున్నాయి. హన్వాడ, నాయినోనిపల్లి, సల్లోనిపల్లి, టంకర, దాచకపల్లితో పాటు మరి కొన్ని గ్రామాలలోని కూలీలకు డబ్బులు అందలేదు. కాగా డీక్యూబ్ సాఫ్ట్‌వేర్‌లో కూలీలకు కూలీ డబ్బు లు ఇచ్చిన వారి అకౌంట్‌లో కట్ కాలేకపోవడంతో సిబ్బందికి తేడా వచ్చింది. దీంతో ఆ నాలుగు నెలల పేమెంట్ ఇవ్వలేదని పోస్టాఫీస్ సిబ్బంది తెలిపారు. బ్యాంక్ ఖాతాలు ఉన్న వారికి రెగ్యులర్‌గా కూలి డబ్బులు వస్తున్నాయి.

సమస్య పరిష్కారానికి చర్యలు

మండలంలోని కొన్ని గ్రామాలలో కొందరి కూలీలకు ఆ నాలుగు నెలల కూలీ డబ్బులు అందలేదు. ఈ సమస్యను పరిష్కరించి కూలీలకు డబ్బులు అందేవిధంగా చర్యలు తీసుకుంటా. కూలి డబ్బులు అందని వారి వివరాలు మా సిబ్బందితో సేకరించి సీఆర్‌డీకి పంపించి ఇప్పిస్తా.

- హైమావతి, ఏపీవో

కూలి డబ్బులు రావాలి

నాలుగు నెలల కూలీ డబ్బులు దాదాపుగా ఏడు వేల రూపాయలు నాకు రావాలి. ఆఫీస్‌లో సమస్య ఉందని కూలి డబ్బులు ఇవ్వడం లేదు. ఎంతో కష్టపడి పనిచేసిన. డబ్బులు రాకపోతే ఎలా. మా ఇబ్బందులను చూసైనా అధికారులు స్పందించి డబ్బులు ఇప్పించేలా చూడాలి.

- యశోద కూలీ, దాచకపల్లి

కేజీబీవీ ఎస్‌వో, ముగ్గురు సిబ్బంది తొలగింపు

ధరూరు, ఏప్రిల్ 28 : గద్వాల జిల్లా ధరూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి యాదమ్మతో పాటు అక్కడే పనిచేస్తున్న సీఆర్‌టీగా విధులు నిర్వహిస్తున్న ఎం.జి విజయలక్ష్మి, మరో ఉద్యోగి ఎం.జ్యోతి, అటెండర్ హలీంబేగంలను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఇందిర ఈ నెల 25న ఉత్తర్వులు జారీచేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేజీబీవీలోని 'నిత్యావసర వస్తువులు పక్కదారి' పట్టడంతో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. వస్తువులు రాత్రివేళ పక్కదారి పట్టినట్లు పక్కా సమాచారాన్ని సేకరించిన అదనపు కలెక్టర్ బాధ్యులను సర్వీసు నుంచి తొలగించాలని డీఈవోను ఆదేశించడంతో తక్షణ చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి, ఏప్రిల్ 28: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మల్లిఖార్జున్ గౌడ్(35) బీచుపల్లి దగ్గర 44వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం గద్వాల అసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులం బంగారం, 15 తులాల వెండి, రూ. 30వేల నగదు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 28 : తాళం వేసిన ఇంట్లో తాళాలు విరగ్గొట్టి తులం బంగారం, 15తులాల వెండి, 30వేల నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... ఉయ్యాలవాడకు చెందిన కాకునూరి నాగమ్మ ఇంటికి తాళం వేసి ఆరు బయట నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి తులం బంగారం, 30వేల నగదు, 15తులాల వెండిని అపహరించుకొనిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగమ్మ నిద్ర లేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

మహిళకు పాము కాటు

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : మండలంలోని రుక్కంపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పాముకాటు గురవడంతో కుటుంబ సభ్యులు గుర్తించి సకాలంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి చెందిన వడ్డె ఎలమ్మ శనివారం ఇంటి బయట ఉండగా పంటపొలాల నుంచి పాము ఇంట్లోకి వచ్చే క్రమంలో ఎల్లమ్మకు తాకడంతో అనుమానం వచ్చి చూడగా పాము కనిపించడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో పామును చంపి అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

గడ్డి వాము దగ్ధం



పర్దీపూర్‌లో గడ్డివాము దగ్ధం

చిన్నచింతకుంట, ఏప్రిల్ 28 : మండలంలోని పర్దీపూర్ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. దాదాపు నాలుగు ట్రాక్టర్ల గడ్డి ఉంటుందని, రూ. 50 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలుగు రమేష్ వాపోయాడు. తనను ఆదుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు.

హన్వాడ గ్రామంలో..

హన్వాడ: హన్వాడ గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య అనే రైతుకు రెండిన రెండు గడ్డి వాములు ఆదివారం తెల్లవారుజామున కాలిపోయాయి. అగ్గి ఎలా అంటుకుందో తెలియదని బాధితుడు వెంకటయ్య తెలిపారు. దాదాపుగా లక్ష రూపాయల విలువ గల గడ్డి దగ్ధమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నగదు



చారకొండలో పట్టుబడిన నగదుతో ఎస్‌ఐ రాజశేఖర్

చారకొండ, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు వాహనాలను తనీఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద రూ. 2.52 లక్షలు నగదు పట్టుబడిందని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. అల్లంపల్లి అరుణ్‌కుమార్ బైక్‌పై డిండి నుంచి చారకొండ మీదుగా దేవరకొండకు వెళ్తుండగా తనిఖీ చేయడంతో నగదు పట్టుబడినట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు అతని వద్ద లేకపోవడంతో డబ్బును జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు పంపించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ పేర్కొన్నారు.

● **మన్ననూరు:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రంలో ఆదివారం సాయంత్రం అధికారులు రూ.50 వేల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన యోగి బల్ల బగారి శ్రీశైలం వెళుతుండగా వాహనాల తనిఖీ సందర్భంలో వారి వద్ద నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సరైన ఆధారాలు చూపించకపోవడంతో అట్టి డబ్బులను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా : ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసనాయక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... అలంపూర్ మండల, కోనేరు గ్రామానికి చెందిన మురళీ మోహన్‌ఆచారి, కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన నల్లబోతుల మధు, నంద్యాల జిల్లా పగిడాలకు చెందిన ఈడిగ నాగేంద్రగౌడ్ టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న వైన్స్ షాపుల సమయం ముగిసిన తర్వాత తాము విక్రయిస్తున్న స్నాక్స్, వాటర్‌బాటిల్స్ నడుమ మద్యం దాచి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకొని ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడులు చేసి ముగ్గురి బెల్ట్ షాపుల నుంచి 300.870లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1,48,170లుగా నిర్ధారించారు.

నేడు రామేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలు

రాజోలి, ఏప్రిల్ 28 : రాజోలి శివారులో ఉన్న తుంగభద్ర నది మధ్యలో ఉన్న శ్రీ రామేశ్వర స్వామి ఆలయంలో నేడు (సోమవారం) సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అడివిస్వామి ఆదివారం తెలిపారు. ఆలయానికి రంగులు వేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. తుంగభద్ర నదిలో నీరు పూర్తి ఎండిపోవడంతో నేరుగా ఆలయం దగ్గరకు వాహనాలు వెళ్లే విధంగా దారి ఏర్పాటు చేసినట్లు చేశారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు అడివిస్వామి కోరారు.

బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు

- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



మహిళా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

రాజాపూర్, ఏప్రిల్ 28 : కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన మహిళ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి పథకంలో భాగంగా 150 రోజులు పని దినాలు కల్పిస్తామని తెలిపారు. రోజుకి రూ. 400 ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

- ఇండిపెండెంట్ అభ్యర్థులు



కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్న ఇండిపెండెంట్ అభ్యర్థులు


మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 28 : ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఇండిపెండెంట్ అభ్యర్థులు మహ్మద్ ఇంతియాజ్, అబ్దుల్ రహీం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ ముస్లిం అడ్వైజరీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, జిల్లా అభివృద్ధి కోసం ఫోరం విజ్ఞప్తి మేరకు తాము నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి, రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే జరుగుతుందన్నారు. ఫోరం సభ్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. నామినేషన్ విత్‌డ్రా చేసుకున్న అభ్యర్థులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఫోరం కన్వీనర్ గులాంగౌస్, కో-కన్వీనర్లు మీర్ షోయబ్‌అలీ, హాజీసలీం, ముస్లిం సంఘాల ప్రతినిధులు అవద్‌బిన్ బాహియల్, మజీద్, మౌలానా నాసర్ మజాహరి, షేక్‌సిరాజ్, ఇస్మాయిల్, హఫీజ్‌గయాజ్ పాల్గొన్నారు.

మూడు నుంచి వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 : కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో వచ్చే నెల మూడవ తేదీ నుంచి కరాటే వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా వైస్ చైర్మన్ చెన్నవీరయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 ఏళ్లుగా ఉచిత శిక్షణ జహంగీర్ ఇస్తున్నారని తెలిపారు. ఆత్మరక్షణకు ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీపాషాఖాద్రీ మాట్లాడుతూ మే మూడు నుంచి జూన్ రెండవ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో చైర్మన్ లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్‌పటేల్, కోశాధికారి తిరుతయ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్ నాయకత్వాన్ని కోరుతున్న ప్రజలు

- కాంగ్రెస్ నాయకుడు జనంపల్లి దుశ్యంత్ రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దుశ్యంత్ రెడ్డి

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని మండల ఇన్‌చార్జీ, డీసీసీ మాజీ అధికార ప్రతినిధి జనుంపల్లి దుశ్యంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పుట్టోనిపల్లి తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు దుశ్యంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఆశించిన స్థాయిలో మేలు జరగలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో హామీలు అమలుచేసి తీరుతారని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్‌తోనే మేలు జరుగుతుందని గుర్తించి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ కమలమ్మతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్



వేసవి కరాటే, యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఏప్రిల్ 28 : వేసవి కరాటే, యోగా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. శ్రీ హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో మోడల్ బేసిక్ స్కూల్ ఏర్పాటు చేసిన వేసవి యోగా, కరాటే శిబిరాన్ని అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు ప్రతీ ఒక్కరు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని, ఏకాగ్రత కోసం యోగా అవసరం అన్నారు. క్రీడలతో ఆరోగ్యం, చదువులో చురుకుగా రాణిస్తారని తెలిపారు. మాస్టర్ వెంకటేష్ మాట్లాడుతూ జూన్ 11వ తేదీ వరకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు మోడల్ బేసిక్ స్కూల్‌లో కరాటే, యోగా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నేరుగా వచ్చి చేరవచ్చన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్, నాయకులు నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు నాయకుల చేరిక

బాలానగర్, ఏప్రిల్ 28 : బీజేపీతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, అందుకే బీజేపీలో చేరామని మండలంలోని పెద్దరేవల్లి గ్రామ నాయకులు బంద్యాల రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బీజేపీలో చేరిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ముకుందారెడ్డి, రాంరెడ్డి, రాజురెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఆదివారం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు తెలిపారు. పాలమూరు పార్లమెంట్ అభ్యర్థిగా డీకే అరుణను గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని, తద్వారా మన జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆటకు వేళాయె..

- మే 1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 18 శిక్షణ శిబిరాలు
- నెల రోజుల పాటు శిక్షణ
- 8 -16 ఏళ్ల బాల, బాలికలకు అవకాశం



శిక్షణలో క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 : రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో చిన్నారులు, యువత కోసం వివిధ క్రీడా అంశాల్లో శిక్షణ కొనసాగుతున్నాయి. నెల రోజుల పాటు జరిగే క్రీడా శిబిరాల్లో ఎంతో ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకుంటారు. ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాశాఖ అధికారులు కోరుతున్నారు.

మే 1 నుంచి 31వ వరకు శిబిరాలు

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే క్రీడాకారులకు వేసవి ఉచిత శిక్షణ అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా యుజన, క్రీడాశాఖ జాతీయ స్థాయి క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఇప్పటికి ముగిసింది. అర్బన్‌లో 12, గ్రామీణ ప్రాంతాల్లో 6, మొత్తం 18 శిబిరాలు నిర్వహించనున్నారు. అవసరమైన చోట కొన్ని శిబిరాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవిలో వివిధ క్రీడాంశాల్లో చిన్నారులకు, క్రీడాకారులకు శిక్షణ అందజేయనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్‌లు శిక్షణ అందజేస్తారు. ఒలంపిక్‌లో గుర్తింపు ఉన్న క్రీడల్లో మాత్రమే శిక్షణ ఉంటుంది. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, చెస్ క్రీడాఅంశాల్లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది వేసవి సెలవుల్లో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నాం. మే 1 నుంచి 31 వరకు శిక్షణ ఉంటుంది. సీనియర్ క్రీడాకారులు, నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం 8 నుంచి 16 ఏళ్ల బాల, బాలికలకు, యువతకు శిక్షణ ఉంటుంది. శిక్షణ శిబిరాలను చిన్నారులు, యువత సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీనివాస్,
జిల్లా క్రీడాశాఖ అధికారి

బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు చేసింది ఏమీ లేదు

- ఎమ్మెల్యే సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

హన్వాడ, ఏప్రిల్ 28 : పేదల కోసం పుట్టి, పేదల కోసం పని చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పేదలకు చేసింది ఏమీ లేదని పాలమూర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటమ్మకుంటతండా, దయ్యాలమర్రితండా, దాచకపల్లి, టంకర, గుడిమల్కాపూర్, రాంనాయక్ తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆగస్టు వరకు రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయలేదని, ఉద్యోగాలు కల్పించలేదని, డబుల్ బెడ్రూంలు ఇళ్ల ఇవ్వాలని ఆరోపించారు. ఎంపీగా చల్లా వంశీచందర్‌రెడ్డి గెలిస్తే మహబూబ్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దాచకపల్లి మాజీ సర్పంచి బాలకిష్టారెడ్డి, గుడిమల్కాపూర్ మాజీ ఉపసర్పంచి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు సురేందర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేష్, మండల అధ్యక్షుడు మహేందర్, యాదయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



హన్వాడ : దాచకపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

కాంగ్రెస్‌లో చేరిన 22వ వార్డు కౌన్సిలర్ రశ్మిత

మహబూబ్‌నగర్ : బీఆర్ఎస్ నుంచి మరో కౌన్సిలర్ చేజారిపోయారు. పాలమూరు పురపాలిక పరిధిలోని భగీరథకాలనీ 22వ వార్డుకు చెందిన రశ్మిత ప్రశాంత్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ నుంచి గెలుపొందిన ఈమె ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరారు. చివరకు కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ తరువాత మరో కౌన్సిరల్ కిశోర్ బీజేపీలో చేరగా తాజాగా రశ్మిత కాంగ్రెస్‌లో చేరగడంతో బీఆర్ఎస్‌లో ప్రస్తుతం 12మంది కౌన్సిలర్లు మిగిలారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కౌన్సిలర్ రశ్మితతో పాటు మాజీ కౌన్సిలర్ సుస్మితాశ్రీనివాస్, 33, 3, 46వ వార్డుకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ బీఆర్ఎస్ ఇక కనుమరుగు కానున్నదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, నూతి శ్రీకాంత్, ఎన్‌పి వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, సీజె బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, మధు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ రూ.100 కరెన్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే : నందమూరి తారకరామారావు రూ.100 కరెన్సీని ఆదివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తుల్లో దివంగత ఎన్టీఆర్ ప్రముఖంగా ఉంటారన్నారు. ఆయన స్మారకార్థం శత జయంతి సందర్భంగా ఆర్బీఐ వంద రూపాయల కరెన్సీని ముద్రించగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య, మురళి, యాదయ్య, కేశవులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఎంపీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, ఏప్రిల్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే దేశం అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి అరవింద్ కుమార్‌రెడ్డి, అన్నారు. ఆదివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల పరిధిలోని కౌకుంట్ల, పేరుర్, జీన్గురాల బస్వాయపల్లి, హజిలాపూర్, లక్ష్మీపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు రైతులను, ప్రజలను ఓట్లు అడగడం సిగ్గుచేటుగా ఉందన్నారు. 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్ వంటి పథకాలను అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రజలకు, రైతులకు బీజేపీపై నమ్మకం లేదన్నారు. ప్రతీ ఒక్కరు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మండల నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కిషన్‌రావు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



రాచాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

రాచాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

అడ్డాకుల, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని రాచాల గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలలో ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. నవగ్రహాలు, గణపతి, నందీశ్వరుడి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం మహబూబ్‌నగర్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● చిన్నచింతకుంట : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం అప్పంపల్లి గ్రామంలో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను మార్చిన బీజేపీని ఓడించాలి

- ఎల్ఐసీ ఐసీఈయూ రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతయ్య

పాలమూరు, ఏప్రిల్ 28 : బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ఎల్ఐసీ ఐసీఈయూ రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'పార్లమెంట్ ఎన్నికలు-కార్మికవర్గ కర్తవ్యం'అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. పదేళ్ల మోదీ పాలనలో కార్మికచట్టాలన్ని యాజమాన్యాలకు చుట్టాలుగా మారాయని, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. తమ హక్కుల రక్షణకు కార్మికరంగం పోరాడే శక్తి లేకుండా నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ చట్టాలపై పోరాడుతున్న రైతులలో 750మంది చావుకు కారణం ప్రధాని మోదీ అన్నారు. ప్రశ్నించే మేధావులను, కళాకారులను, కవులను ఉపా చట్టం కింద జైలు పాలు చేశారన్నారు. అందుకే బీజేపీ చిత్తుగా ఓడించి, ఇండియా కూటమి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఐటీ యూ సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తిలు ప్రసంగించారు. దేశంలో సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టి రూ.150 లక్షల కోట్ల అప్పునకు తెరలేపారని, బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ మార్గద ర్శకత్వంలో ప్రభుత్వం నడుస్తోందన్నారు. గాంధీని చంపిన గాడ్సే వారసులుగా బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. వి.కురుమూర్తి, సత్యన్న, వరద గాలెన్న, గొనెల రాములు, రామ్మోహన్‌రావు, కేశవులు, అలివేల, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్ఐసీ ఐసీఈయూ రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతయ్య

తాటికొండలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ

భూత్పూర్, ఏప్రిల్ 28 : మండలంలోని తాటికొండ గ్రామంలో మూడు రోజులుగా గ్రామదేవతలైన కోట మైసమ్మ, ఊరడమ్మ, బొడ్రాయి, (నాభిశిల) శీతల మాత, బంగారు మైసమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆఖరి రోజున విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపన కల్యాణ హోమాలు, స్వర్ణహోమాలు, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, అవబృత ప్రోక్షణ, మహామంత్ర పుష్పార్చన, మొదలగువాటిని వేదపండితులు నిష్ఠతో నిర్వహించారు. అనంతరం సాయంత్ర గ్రామంలోని అన్ని వీధుల నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించడానికి మహిళలు భారీ మొత్తంలో తరలివచ్చారు. పోతురాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, మహిళల నృత్యాలు వంటి కార్యక్రమాలు ఎంతగానో అలరింపజేశాయి. గ్రామంలో ప్రతీ ఇంట్లో బోనాల వేడుకల సందర్భంగా పండుగలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బస్వరాజు గౌడ్, మునిసిపల్ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు హాజరై గ్రామ దేవత విగ్రహాల ప్రతిష్ఠాపన పూజా కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచులు శ్రీనివాస్‌గౌడ్ (గురు), శ్రీనివాస్, ఎంపీటీసీలు వెంకటేశ్వరమ్మ, సాయిలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపనలు

మిడ్జిల్ : జడ్చర్ల మండలంలోని నెక్కొండ గ్రామంలోని ఆదివారం భక్తి శ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపనలను వేదపండితుల మంత్రోచ్చరణాలతో నిర్వహించారు. గ్రామంలోని ధ్వజస్తంభం, గణపతి, శివలింగం, నంది, ఆంజనేయస్వామి, నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించినట్లు కాటేమోని కృష్ణయ్య తెలిపారు. అనంతరం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాల సందర్భంగా పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వివిధ గ్రామాల భక్తులు ఉన్నారు.



ఆలయంలో దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

ఘనంగా ఎల్లమ్మదేవత విగ్రహం ప్రతిష్ఠ

గండీడ్, ఏప్రిల్ 28 : మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఎల్లమ్మదేవత గుడిలో దేవత మూర్తి, జంటనాగుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజులపాటు జరిగాయి. చివరి రోజు ప్రతిష్ఠ, బోనాల కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీవెంకట్, నాయకులు, పెద్దలు భీమయ్య వెంకటయ్య, కేశవులు, ప్రభాకర్‌రెడ్డి, ఎం వెంకటయ్య పాల్గొన్నారు.

తాళ్లగడ్డలో మాజీ ఎమ్మెల్యే ఆల ప్రచారం

అడ్డాకుల, ఏప్రిల్ 28 : మూసాపేట మండల పరిధిలోని తాళ్లగడ్డలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయ పునర్నిర్మాణం, నాభిశిల, ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆలను సన్మానించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కచ్చితంగా గెలుస్తాం

- బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



హన్వాడ : కొనగట్టుపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఎంపీ మన్నె, మాజీ మంత్రి

హన్వాడ, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో ఖచ్చితంగా బీఆర్ఎస్ గెలుస్తుందని ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కొనగట్టుపల్లిలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. బీఆర్ఎస్ గెలిపించాలని కోరారు. నాయకులు కరుణాకర్‌గౌడ్, జంబులయ్య, బాలరాజు, బసిరెడ్డి, రమణారెడ్డి, విజయ నిర్మల, మానస పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్‌కు పరామర్శ

నవాబ్‌పేట, ఏప్రిల్ 28 : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ సుభాన్ చారి తల్లి ఆదివారం మరణించగా, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి ఆదివారం జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులుతో కలిసి సుభాన్‌చారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని లోటు జీవితంలో తీరనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, పాశం గోపాల్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

దివంగత మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డికి నివాళి

మిడ్జిల్, ఏప్రిల్ 28 : జడ్చర్ల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఆదివారం కావేరమ్మపేటలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. వెంకట్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రఘునందన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కాట్రపల్లి లక్ష్మయ్య, బుక్క వెంకటేషం, యాదిరెడ్డి, కొంగళి జంగయ్య, కృష్ణారెడ్డి, రఘురాంగౌడ్, కరాటే శ్రీను, యాదయ్య, బుక్క మహేష్, జగదీష్‌చారితో పాటు తదతరులున్నారు,

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఏప్రిల్ 28 : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, వారు చూపే మోసపూరిత ఆశలకు గురికారా దని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు మోసం చేయడం సుల భంగా ఉందన్నారు. జిల్లాలో పై స్థాయి అధికారులు వాట్సాప్ ఫొటోలను, డీపీలుగా మార్చుకొని కిందిస్థాయి ఉద్యోగులను డబ్బులు పంపమని వాట్సాప్ మెసేజ్‌లు చేయడం జరుగుతుందని అలాంటి వాటి ని ఎవరు నమ్మరాదన్నారు. పై స్థాయి అధికారులు ఎవరు డబ్బులు అడగరని గుర్తించు కోవాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా మోసాలకు గురైతే 1930కి ఫోన్ చేయాలని అన్నారు. సైబర్ నేరాల పై ప్రజలకు పోలీస్‌లు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు.

వీధి లైట్లు లేక ఇక్కట్లు

నారాయణపేట, ఏప్రిల్ 28 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిల్ లైన్ ఎస్‌బీఐ బ్యాంకు నుంచి పాత బస్టాండ్ వరకు వీధి లైట్లు లేకపోవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం అరు దాటితే చాలు చీకటి కమ్ముకుపోతుంది. దీంతో రాత్రి వేళ వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు రోడ్లపై ఉన్న గుంతలు కనిపించకపోవ డంతో కిందపడి గాయాలపాలవుతున్నారని పలువురు వాపోతున్నారు. గతంలో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఉండేవని, రోడ్డు వెడల్పులో భాగంగా స్తంభాలను తొలగించడంతో కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పులిమామిడి, బిజ్వార్ గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్

ఊట్కూర్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు భద్రతా, భరోసా కల్పించేందుకే కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బి.శ్రీనివాసులు అన్నారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా ఆదివారం మండలంలోని పులిమామిడి, బిజ్వార్ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంచి శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కృషి చేస్తు న్నామన్నారు. ఎన్నికల్లో ధైర్యంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజలందరికీ జిల్లా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల్లో కేంద్ర బలగాలు కీలక పాత్ర వహిస్తాయన్నారు.